క్లుప్తంగా

హెచ్ఎంపై దాడి చేసిన వారిని శిక్షించాలి

సీపీఎం మండల కార్యదర్శి రమేశ్



మాడ్గుల: ఇటీవల తుక్కుగూడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయుడు రాములుపై అయ్యప్ప స్వామి ముసుగులో దాడికి పాల్పడటం హేయమైన చర్య అని సీపీఎం మండల కార్యదర్శి రమేశ్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అయ్యప్ప మాలధారులు, బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న హెచ్ఎం రాములుపై విచక్షణ రహితంగా దాడి చేయడాన్ని ఖండించారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నందివనపర్తిలో ఫుడ్ ఫెస్టివల్



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు తమ ఇళ్ల నుంచి రకరకాల ఆహార పదార్థాలను తయారు చేసుకుని ప్రదర్శనలో ఉంచారు. చికెన్, మటన్ బిర్యానీలు, జొన్నరొట్టె, చికెన్‌ఫ్రై, పులిహోరా, మంచురియా తదితర వాటిని తీసుకొచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటరమణ శాస్త్రీ, ఉపాధ్యాయులు కిషన్, వెంకట్ రెడ్డి, పద్మశ్రీ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


గంజాయి నిర్మూలనపై అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న మస్కు చరణ్

యాచారం: మండల పరిధిలోని గునుగల్ ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గంజాయి, మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మస్కు చరణ్ పాల్గొని మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు నేటి విద్యార్థులపైనే ఉందని అన్నారు. విద్యార్థులే గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలని కోరారు. ఈ సదస్సులో యాచారం మండల అధ్యక్షుడు విప్లవ్‌కుమార్, నాయకులు వంశీ, శ్రీకాంత్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన మైసిగండి ఆలయం



కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయం నూతన సంవత్సర వేడుకలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. నూతన సంవత్సరంలో ఆలయంలో పూజలు నిర్వహించేందుకు భక్తులు వేలాదిగా తరలి రానుండటంతో నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని కొబ్బరి, మామిడి తోరణాలు, పుష్పాలతో అలంకరిస్తున్నారు.

గ్రామం మీదుగా బస్సు వెళ్లాలి



చిత్తాపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

తిప్పాయిగూడ గ్రామస్తుల ఆందోళన

మంచాల: ఇబ్రహీంపట్నం నుంచి చౌటుప్పల్ వెళ్లే ఆర్టీసీ బస్సు తమ గ్రామం మీదుగా వెళ్లాలని మండలంలోని తిప్పాయిగూడ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక సీపీఎం నాయకులతో కలిసి మంగళవారం చిత్తాపూర్ గ్రామంలో బస్సును ఆపి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. చౌటుప్పల్ బస్సు కోసం దాదాపు మూడు కిలోమీటర్లు నడిచి చిత్తాపూర్ ఎక్కుతున్నామన్నారు. గతంలో ఉన్న మాదిరి బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జంగయ్య, నర్సింహ, యాదయ్య, మాధవి, సుధాకర్, శర్మ, ఐలయ్య, సత్తయ్య, బాలకృష్ణ, రమేష్, రాములు, ప్రభాకర్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు ఎనలేనివి

గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



మన్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప మేధావిని కోల్పోయిందని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బాటసింగారంలో వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మంగళవారం మన్మోహన్ సింగ్ చిత్రపటానికి చైర్మన్ ఆధ్వర్యంలో పాలక వర్గం, అధికారులు, సిబ్బంది పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో మన్మోహన్ సింగ్ కృషి ఎంతో ఉందని, దేశానికి ఆయన చేసిన సేవలు ఎనలేనివని కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సీహెచ్ భాస్కర్‌చారి, డైరెక్టర్లు జైపాల్ రెడ్డి, అంజయ్య, లక్ష్మి, రఘుపతిరెడ్డి, గణేష్ నాయక్, నరసింహ, మధుసూదన్‌రావు, నవరాజ్, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌గుప్తా, ఇబ్రహీంతో పాటు మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మార్పీఎస్, దళిత నాయకులు

ప్రధానోపాధ్యాయుడిపై దాడి హేయమైన చర్య

ఆమనగల్లు: తుక్కుగుడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై సనాతన ధర్మం పేరుతో అయ్యప్పస్వాములు, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నాయకులు దాడిచేయడం సరైందికాదని దళిత, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆమనగల్లు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మల్లేశ్, సాయిలు, మైసయ్య, అంబేడ్కర్ పూలే జాతర కమిటీ వ్యవస్థాపకుడు సుధాకర్, నాయకులు భిక్షపతి, బాల్‌రాం, కృష్ణ, విజయ్‌చందర్, రమేశ్, భాస్కర్, కిషన్, నర్సింహ, రమేశ్, మల్లయ్య, రాగ్యనాయక్, కిషన్, శ్రీనునాయక్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల: గ్రామాల్లో ప్రజలు ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జాపాల గ్రామంలో బకున చంద్రకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధ్యాత్మికత ద్వారా ప్రజల్లో మార్పు వస్తుందన్నారు. మంచి మార్పు కోసం అందరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, నాయకులు వెంకటరమణారెడ్డి, చంద్రయ్య, రమేశ్, రాజు, అరవింద్, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంచాల: అయ్యప్ప స్వామి పూజలో పాల్గొన్న కిషన్‌రెడ్డి తదితరులు

బీఆర్ఎస్ నేతకు పరామర్శ

తుర్కయంజాల్: ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి రాగన్నగూడ మాజీ సర్పంచ్ కందాడ లక్ష్మారెడ్డిని మన్నెగూడలోని నివాసంలో మంగళవారం పరామర్శించారు. ఇటీవల కాలు విరగడంతో లక్ష్మారెడ్డి ఆస్పత్రిలో చికిత్స పొంది, ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆయన ఆరోగ్య పరిస్థితిని మాజీ ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవరెడ్డి, రఘునాథ్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి, గౌతమ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: ఉప్పరిగూడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను మంగళవారం ఆవిష్కరించారు. అదేవిధంగా ఇటీవల సంఘ సభ్యులైన శేరిగూడకు చెందిన రైతులు ఎస్.పాండు, ఎం.శ్రీధర్ కుటుంబ సభ్యులకు రూ.15 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ పాండు రంగారెడ్డి, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, సీఈఓ గణేశ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మంగళవారం సాయంత్రం యాచారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. సీఐ నర్సింహారావు ఆధ్వర్యంలో అతి వేగంగా వెళ్లకూడదని ప్రయాణికులకు సూచించారు.

పండ్ల మార్కెట్‌లో ఏఐటీయూసీ సమావేశం



నూతనంగా ఏర్పాటైన కార్యవర్గం

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధిలోని బాటసింగారంలో గల గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు హరిసింగ్‌నాయక్, జిల్లా కార్యవర్గసభ్యుడు నరసింహ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ గౌరవాధ్యక్షుడిగా హాజీ, అధ్యక్షుడిగా మక్సుద్, ఉపాధ్యక్షులుగా షరీఫ్, రాములు, మున్నా, అలీమ్, ప్రధాన కార్యదర్శిగా చిన్న గౌడ్ కోశాధికారిగా పోచయ్య, కార్యదర్శిగా శంకర్ నాయక్, సహాయ కార్యదర్శిగా గంగారం, దేవేందర్, కార్యవర్గ సభ్యులుగా తిప్పన్న, ఉప్పర్ ఎండీ అబ్దుల్లా, ఎండీ ఆతీఫ్, ఎండీ అప్సర్, కృష్ణ, సాయిలు, మున్నాతోపాటు 30 మంది కౌన్సిల్ సభ్యులతో కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి



రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం ఇబ్రహీంపట్నంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్రధాన రహదారిపై నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య, నాయకులు రాంచందర్, జగదీశ్, చంద్రమోహన్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, బుగ్గరాములు, జగన్, సుమలత, ఎల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంచాల ఎస్సైకు సేవా పతకం



మంచాల: రాష్ట్ర పోలీసు శాఖ ప్రకటించిన అవార్డుల్లో మంచాల ఎస్సై లాలయ్యకు 'సేవా పతకం' వరించింది. మంగళవారం పోలీసు శాఖలో పని చేస్తున్న వారిలో ఉత్తమ ప్రతిభను గుర్తించి అవార్డులను ప్రకటించారు. లాలయ్యకు సేవా పతకంతో పాటు రూ.20వేలు పారితోషికం అందించనున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. అవార్డు రావడం చాలా గర్వంగా ఉందన్నారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు మా శ్రమను గుర్తించి అవార్డులు ఇవ్వడం వృత్తిపట్ల మరింత విశ్వాసాన్ని పెంచుతుందన్నారు.